సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 7 । అక్టోబర్ । 2024



సోమశిలలో 52.093 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 52.093 టీఎంసీలు ఉన్నాయి. పైతట్టునుంచి 10,520 క్యూసెక్కుల వరద వస్తుండగా, పెన్నార్ డెల్టాకు 2 వేలు, ఉత్తరకాలువకు 540, దక్షిణకాలువకు 8,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.78,220
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,120
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,334
నవర (8 గ్రాములు)	రూ.58,672

గరిష్ఠం/కనిష్ఠం
36.8 /27.8

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉంటాయి. ఆదివారం గాలిలో తేమ 58 శాతం ఉంది.

దుర్గార్తిశమనీ.. సకల జయకరీ



రాజరాజేశ్వరి అలంకారంలో శ్రీవాసవికన్యకా పరమేశ్వరి

శరన్నవరాత్రి వేడుకలు ఆదివారం భక్తిప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ ఆలయాల్లో శనివారం జగజ్జననీ ఉగ్రరూప అవతారాల్లో కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. సకల జయకరీ అలంకారాల్లో ఉన్న అమ్మవారిని మనః పూర్వకంగా దర్శించుకుని ఆధ్యాత్మికంలో తన్మయులయ్యారు. ఆలయాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని కామాక్షితాయి మధుకైటభవధ అలంకారంలో, నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీవాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు.



నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో అన్నపూర్ణ అలంకారం



బుచ్చిరెడ్డిపాళెంరూరల్: మధుకైటభవధ అలంకారంలో కామాక్షితాయి

దరఖాస్తు రాబడికి సిండికేట్ల స్ట్రోక్

- ఊరూరా తిరిగి పాత వ్యాపారులను బతిమాలుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు
- అన్ని విధాలా సహకరిస్తామని హామీ
- టీడీపీ నేతల సిండికేట్‌తో ఔత్సాహిక వ్యాపారులు దూరం
- అయినా స్పందన శూన్యం
- 182 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు అరకొరగానే వచ్చిన దరఖాస్తులు
- ఈనెల 9వ తేదీతో ముగియనున్న దరఖాస్తులకు చివరి గడువు

బాబ్బాబు.. ప్లీజ్ దరఖాస్తులు వేయండి

జిల్లాలో మద్యం వ్యాపారాన్ని తమ గుప్పెట్లో పెట్టుకునేందుకు టీడీపీ నేతలు మాస్టర్ ప్లాన్ వేశారు. మద్యం దుకాణాల కేటాయింపు అంతా పారదర్శకంగా ఉంటుందని ప్రభుత్వం చెబుతున్నా.. ఎవరూ దరఖాస్తులు వేయకుండా ఇప్పటికే టీడీపీ నేతలు ఔత్సాహిక, పాత వ్యాపారులకు అడ్డుకట్ట వేశారు. ఒక్కొక్క దుకాణానికి ఎన్ని దరఖాస్తులు అయినా వేయొచ్చు అని, ఫీజును రూ. రెండు లక్షలుగా నిర్ణయించింది. అయితే నోటిఫికేషన్ ఇచ్చి ఆరు రోజులు అవుతున్నా.. కేవలం దరఖాస్తులు రెండు పదులు కూడా దాటలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఊరూరు తిరిగి దరఖాస్తులు చేయాలని పాత వ్యాపారులను బతిమాలుతున్నా.. ముందుకు రావడం లేదు. టీడీపీ నేతల సిండి'కేట్లు' స్ట్రోక్‌తో ప్రభుత్వ రాబడికి గండి పడింది.



నెల్లూరు (క్రైమ్): భారీగా పెరిగిన లైసెన్సు, దరఖాస్తు ఫీజులు, కూటమి నేతల సిండికేట్‌తో ఆశావహులతో పాటు గతంలో మద్యం వ్యాపారులు దరఖాస్తులు దాఖలు చేసేందుకు వెనుకంజ చేస్తున్నారు. జిల్లాలో 182 దుకాణాలకు ఆరు రోజుల క్రితం నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. ఇప్పటి వరకు దరఖాస్తులు రెండు పదులు కూడా దాటలేదని తెలుస్తోంది. దీంతో కంగుతిన్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారుల్లో ఆందోళన మొదలైంది. డిప్యూటీ కమిషనర్, ఏసీ, ఈఎస్‌లు రంగంలోకి దిగారు. జిల్లా వ్యాప్తంగా అన్నీ ఎక్సైజ్ స్టేషన్ల సందర్శిస్తున్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో గతంలో వ్యాపారం చేసిన వారిని, ఆశావహులతో పిలిపించి అన్ని విధాలా సహకరిస్తామని ముందస్తు హామీ ఇచ్చి దరఖాస్తులు దాఖలు చేయాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ అనేక మంది నిరాసక్తి కనపరుస్తున్నారు.

పారదర్శకతకు పాతర

పాత పద్ధతిలోనే మద్యం విధానం అమలు చేస్తూ పారదర్శకంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అధికార పార్టీ నేతలు నేతలంతా సిండికేట్‌గా మారి పారదర్శకతకు పాతరేశారు. ఇతరులు ఎవరైనా దరఖాస్తు చేసే స్వాతంత్ర్యం లేకుండా సామ, ధాన, దండోపాయాలను ప్రయోగించారు. అన్ని మద్యం దుకాణాలను తామే దక్కించుకోవాలని జాగ్రత్త పడుతున్నారు. సాధ్యమైనంత మేర దరఖాస్తులు తక్కువగా పడేలా పావులు కదుపుతున్నారు. ఇతరులెవరూ దరఖాస్తు చేసుకోకుండా నిలువరించే ప్రయత్నాలు చేస్తున్నారు. బినామీ పేర్లతో దరఖాస్తు చేయించేందుకు సిద్ధమవుతున్నారు. మరికొందరు దరఖాస్తులు చేసి దుకాణాలు దక్కించుకునేందుకు బదులుగా దుకాణం వచ్చిన వారి నుంచి వాటాలు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద కూటమి నేతల భయంతో ఆశావహుల్లో అనేక మంది దరఖాస్తులు సమర్పించేందుకు సాహసం చేయడం లేదని తెలుస్తోంది. గతంలో వ్యాపారం చేసిన వారు సైతం జంకుతుండడం కూటమి నేతల ఒత్తిళ్లు, హెచ్చరికలు ఏ స్థాయిలో ఉన్నాయో అవగతమవుతోంది.

ప్రభుత్వానికి రూ.కోట్లల్లో గండి

జిల్లాలోని 11 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 182 ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుకు కలెక్టర్ ఈ నెల 1న నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు దాఖలు చేయాల్సి ఉంది. దరఖాస్తుల స్వీకరణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఆరు రోజుల్లో కేవలం రెండు పదుల సంఖ్యలోనే దరఖాస్తులు దాఖలైనట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎవరు ఏ దుకాణానికి వేశారో అనే విషయాలు సైతం ఎక్సైజ్ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. లైసెన్సు ఫీజు ద్వారా ప్రభుత్వానికి రూ.115.70 కోట్లు రాబడి అయితే వస్తుందేమో కానీ, దరఖాస్తుల రూపేణా రూ.కోట్లల్లో వచ్చే రాబడికి గండి పడింది. దరఖాస్తుల ద్వారా కూడా మరింత ఆదాయం సమకూర్చాలని ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులకు ఒత్తిడి పెంచుతోంది. అయితే టీడీపీ నేతలు సిండికేట్ వల్ల దరఖాస్తుల దాఖలు చేసేందుకు ఆశావహులు, వ్యాపారులు ముందుకు రాకపోవడంతో ఎలాగైనా అధిగమించేందుకు ఊరూరు తిరిగి పాత వ్యాపారులు, కొత్తవారిని ప్రోత్సహించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దరఖాస్తు చేసే గడువు దగ్గర పడుతుండడంతో గత రెండు రోజులుగా ఎక్సైజ్ అధికారులు విస్తృతం పర్యటించి షాపులు వస్తే.. అన్ని విధాలా సహకరిస్తామని దరఖాస్తు చేయమని ప్రాధేయపడుతున్నారు. ఒక వేళ షాపు వస్తే.. టీడీపీ నేతలను తట్టుకుని మాకు మీ సహకారం అందిస్తారనే నమ్మకం మీకు ఉందాని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ఏమీ చెప్పలేక.. ఎక్సైజ్ అధికారులు నీళ్లు నములుతున్నారు. తక్కువ సంఖ్యలో దరఖాస్తులు పడితే అంతా సిండికేట్ అయ్యారనే ప్రచారం బలపడుతుందని, ఇది ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనే ఆలోచనతో ఎక్సైజ్ అధికారులు ఆపసోపాలు పడుతున్నారు.

జెండా మోసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు





సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ కార్యకర్తలు, నాయకులు, మాట్లాడుతున్న కాకాణి, వేదికపై విజయకుమార్‌రెడ్డి, అనిల్, అరుణమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- నెల్లూరురూరల్ నియోజకవర్గ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీకి కష్టకాలంలో ఎవరైతే జెండాను భుజాన మోస్తున్నారో వారికి అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం నగరంలోని జెట్టి శేషారెడ్డి కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశం జరిగింది. కాకాణి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు టీడీపీ నేతల బెదిరింపులను లెక్క చేయకుండా కలిసికట్టుగా ఉండడం మంచి పరిణామం అన్నారు. దేశంలో చంద్రబాబు వంటి నీచమైన నేతను ఇంత వరకు చూడలేదన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు, హత్యలు తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చింది లేదని మండిపడ్డారు. 100 రోజుల్లో తాను ప్రజలు ఏమీ చేసింది లేదని, తిరుమల పవిత్రను దెబ్బ తీసేందుకు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వెంకటేశ్వరస్వామితో చంద్రబాబు పెట్టుకున్నారని, ఆ దేవుడే చూసుకుంటారన్నారు. నాలుగు నెలల్లోనే ఎందుకు ఓట్లు వేశామా అని ప్రజలు బాధపడుతున్నారు. కార్యకర్తలు అరెస్ట్‌లు, జైళ్లకు భయపడాల్సిన అవసరం లేదని, తాము అండగా ఉంటామన్నారు. ఆనం విజయకుమార్‌రెడ్డికి జగన్‌మోహన్‌రెడ్డి వద్ద ప్రత్యేక స్థానం ఉందని, భవిష్యత్‌లో కచ్చితంగా ఎమ్మెల్యేగా ఎన్నిక అవుతారని నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచి కష్టపడాలన్నారు.

తిరిగి అధికారంలోకి వస్తాం..



తిరిగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకుంటామని మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ చెప్పారు. అప్పుడు జగనన్నతో ఉన్నాం.. ఇప్పుడు ఉన్నాం.. ఎప్పటికీ ఉంటామన్నారు. జమిలీ ఎన్నికలా.. ఇంకో ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీకి అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. సింగిల్‌గా వచ్చి జగనన్నను ఎదుర్కునే దమ్ము ఏ రాజకీయ పార్టీకి లేదు. తమిళనాడులో డీఎంకేకు రెండు సీట్లు మాత్రమే వచ్చాయి. తర్వాత డీఎంకే ప్రభంజనం చూశామన్నారు. భవిష్యత్‌లో ఏపీలో కూడా అటువంటి పరిస్థితే పునరావృతం అవుతుంది. తాడోపేడో తేల్చుకునే వారికి పార్టీ పదవులు వస్తాయన్నారు. జైలుకు పంపిస్తే భయపడే వ్యక్తులం కాదన్నారు. కొందరు కార్పొరేటర్లు పార్టీ నుంచి వెళ్లినంత మాత్రనా పార్టీకి నష్టం లేదని, కార్యకర్తలు అండ ఉందన్నారు.

నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే తాటతీస్తా



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే తాట తీస్తానని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీలో గెలిచి, పార్టీ ఓడిపోవడంతో కొందరు స్వార్థ రాజకీయాలకు పార్టీని వదిలి వెళ్లిపోతున్నారు. కార్యకర్తలు, ప్రజలు పార్టీలోనే ఉన్నారన్నారు. పార్టీకి ద్రోహం చేసే వారిని భవిష్యత్‌లో కార్యకర్తలు తన్నే రోజులు వస్తాయన్నారు. భయపెట్టి పార్టీలోకి తీసుకునే వ్యక్తి నాయకుడా? అని ప్రశ్నించారు. హైవే పక్కన ఎప్పటి నుంచి కట్టిన పవన్‌కళ్యాణ్ కటౌట్‌ను తాము తొలగించామని ఆరోపించడం సిగ్గు చేటన్నారు. రెచ్చగొట్టేందుకు ప్రయత్నాలు చేశారని, తాము సంయమనం పాటిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి వచ్చే కార్యకర్తలను రానివ్వకుండా బెదిరించారన్నారు. ప్రతి కార్యకర్త నా కుటుంబ సభ్యుడే అన్నారు. వేల మంది సమావేశానికి వచ్చి విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు.

పార్టీ ద్రోహులకు తత్వం బోధపడుతుంది



పార్టీ కోసం కష్టపడ్డ వారికి ముమ్ముందు మంచి మంచి పదవులు వస్తాయని, పార్టీని వీడిపోయిన ద్రోహులకు త్వరలోనే తత్వం బోధపడుతుందని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నాలుగు నెలల్లోనే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని నమ్మకం వచ్చిందన్నారు. కొందరు పార్టీ వీడినంత మాత్రన పార్టీకి నష్టం లేదన్నారు. నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ స్ట్రాంగ్‌గా ఉన్న ప్రాంతం, తిరిగి పూర్వ వైభవాన్ని ఆనం విజయకుమార్‌రెడ్డి తీసుకొస్తారన్నారు. జగనన్నకు కూడా విజయన్న అంటే అభిమానం, నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, పేర్నేటి కోటేశ్వరరెడ్డి, బద్దిపూడి రవీంద్ర, మల్లు సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సత్తార్, వేలూరు మహేష్, నాయకులు లేబూరు పరమేశ్వరరెడ్డి, హంసకుమార్‌రెడ్డి, ఆర్ శ్రీనివాసరావు, నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖ మారదా

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ ప్రైవేట్ ఉద్యోగిదే పెత్తనం
- ఓ న్యాయమూర్తి రిజిస్టర్ డాక్యుమెంట్‌కు డబ్బులు డిమాండ్

నెల్లూరుసిటీ: జిల్లాలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ అవినీతి, అక్రమాలతో నిత్యం వార్తల్లోకెక్కుతోంది. కొందరిపై వేటుపడినా.. మిగతా అధికారుల్లో మార్పు కనిపించడం లేదు. తమ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే సామాన్యుడైనా సరే.. చట్ట పరిరక్షకుడైన న్యాయమూర్తి అయినా సరే డబ్బులు సమర్పించందే రాజముద్రలు పడవు. నెల్లూరులోని ప్రధాన రిజిస్ట్రేషన్ శాఖలో ఓ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ప్రైవేట్ వ్యక్తితో మొత్తం వ్యవహారం నడిపిస్తున్నారు. ఇటీవల జాయింట్ 2 సబ్‌రిజిస్ట్రార్ బదిలీ కావడంతో అదే కార్యాలయంలో ఓ ఉద్యోగిని ఇన్‌చార్జిగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజు నుంచే బహిరంగంగా ముడుపులు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులిస్తేనే రిజిస్ట్రేషన్లు చేస్తామని డాక్యుమెంట్ రైటర్లకు హెచ్చరికలు జారీ చేశారు. ఓ ప్రైవేట్ వ్యక్తిని నియమించుకున్నారు. అతను ఆమోదముద్ర వేస్తేనే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు వెళ్తుంది. ఇటీవల ఓ న్యాయమూర్తికి సంబంధించిన ఆస్తి డాక్యుమెంట్ రిజిస్ట్రేషనకు వస్తే.. డబ్బులివ్వందే పనిచేయడం కుదరదని స్పష్టం చేసి పక్కన పడేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై కార్యాలయంలో చర్చ జరుగుతోంది. ఆ ప్రైవేట్ ఉద్యోగి సెలవులో ఉండడంతో శనివారం కార్యాలయంలో సర్వర్ పనిచేయడం లేదంటూ రిజిస్ట్రేషన్లనే నిలిపివేసిన విషయం చర్చనీయాంశంగా మారింది.

న్యూస్‌రీల్

జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎంపిక



ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సాధారణ సమావేశం ఆదివారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించారు. 2024 నుంచి 2028 వరకు అసోసియేషన్ కార్యకలాపాలను నిర్వహించేందుకు ఆఫీసు బేరర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా మలిరెడ్డి శ్రీనివాసులు, కార్యదర్శిగా బి చంద్ర శేఖర్, కోశాధికారిగా బి ఉమాశంకర్, ఉపాధ్యక్షులుగా డి అనిల్‌కుమార్, పీసీ జాకబ్, బాలప్రసాద్, కె సత్యరాజ్, సంయుక్త కార్యదర్శులుగా ఆర్ కిరణ్‌కిశోర్, బి రవీంద్రనాథ్, కె శ్రీనివాసరావు, ఎం కిరణ్‌కుమార్ కార్యవర్గ సభ్యులుగా పి ఇమ్రాన్, రత్నకుమార్, విజయ్ విశ్వేశ్వరన్, ఎస్ మోహన్, ఎ శివకుమార్, ఎ ప్రవీణ్‌కుమార్, చిట్టిబాబు, ఎం వినోద్, ఎ జీవన్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియకు పరిశీలకులుగా డీఎస్‌డీఓ ఆర్‌కే యతిరాజ్, ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి విజయ్‌కుమార్, నెల్లూరు ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి గురుప్రసాద్ వ్యవహరించారు.

'రంగడి' సేవలో ఏపీ ఎలక్షన్ కమిషన్ జాయింట్ సెక్రటరీ



జీవీ సాయిప్రసాద్‌కు ఆలయ మర్యాదలతో స్వాగత పలుకుతున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి వారిని ఆదివారం ఏపీ ఎలక్షన్ కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్ దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఆయన్ను దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఆహ్వానించారు. దర్శనం అనంతరం తీర్థ, ప్రసాదాలు అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌కు అనూహ్య స్పందన



ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో నిర్వహించిన రాష్ట్ర ఫిష్ ఫుడ్ ఫెస్టివల్-3కు అనూహ్య స్పందన లభించిందని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో ఆదివారం పలు రకాల ఉత్పత్తులతో పాటు, పలు రకాల వంటకాలను ప్రదర్శించారు. సోమవారం మూడో రోజు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

కొండ పోరంబోకు ఆక్రమణ



చెట్లు తొలగించిన దృశ్యం

వరికుంటపాడు: మండలంలోని జడదేవి పంచాయతీకి చెందిన సుమారు 200 ఎకరాల కొండ పోరంబోకును ఆదివారం కొందరు జేసీబీతో చెట్లు తొలగించి ఆక్రమణ చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. అధికారులకు సమాచారం అందించినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సెలవుల్లో ఊరెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త

- తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- అందుబాటులో ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు
- వినియోగించుకోవాలని కోరిన ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): దసరా సెలవుల్లో సొంతూర్లు, బంధువుల ఇళ్లు, విహారయాత్రలకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారా? అయితే జర జాగ్రత్త. జిల్లాలో ఏదో ఒకచోట దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. సెలవులకు ఊర్లకు వెళ్లేవారు తమ ఇళ్లకు భద్రత ఏర్పాటు చేసుకోవాలి. నగదు, బంగారు ఆభరణాలు వంటి విలువైన వస్తువులను ఇంట్లో ఉంచరాదు. బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి. దొంగతనాలను అరికట్టేందుకు పోలీసు శాఖ ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం)ను అందుబాటులోకి తీసుకువచ్చింది. సాంకేతికతతో నేరాలు అదుపు చేసేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో దీని వినియోగం అంతంత మాత్రంగానే ఉంది. ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఏర్పాటు చేసుకుంటే చోరీలను అదుపు చేయొచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.



ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్



జిల్లాలో పోలీస్ డివిజన్లు : 5
సర్కిల్స్ : 12
అర్బన్ పోలీస్ స్టేషన్లు : 11
మిగిలిన ప్రాంతాల్లో ఉన్న స్టేషన్లు : 53

వినియోగం ఇలా..

గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీసు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్ నంబర్, అడ్రస్‌తో నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ పూర్తవగానే వచ్చే ఐడీ భద్రపరుచుకోవాలి. ఊరు వెళ్లే సమయంలో యాప్‌లోకి వెళ్లి యూజర్ ఐడీ నమోదు చేసి ఏ తేదీ ఏ సమయానికి వెళ్తున్నారు? తిరిగి ఎప్పుడొస్తారు? తదితర వివరాలను పొందుపరిచి రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. వారు స్థానిక పోలీసుల సహకారంతో ఇంటికొచ్చి పైసా ఖర్చు లేకుండా వైఫై రోటర్, సెన్సార్‌తో పనిచేసే మోషన్ కెమెరాలు, విద్యుత్ పోయినా పనిచేసేలా యూపీఎస్ ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు. ఇంట్లోకి అపరిచితులు ప్రవేశించేందుకు యత్నిస్తే సెన్సార్ ద్వారా ఫొటోలు తీయడంతోపాటుగా అలారం ద్వారా కంట్రోల్ రూమ్, స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తుంది. వెంటనే సంబంధిత పోలీసుస్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను పట్టుకునే అవకాశం ఉంది. దీంతో నేరం జరగకముందే అరికట్టినట్లు అవుతుంది. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా, 94407 96383, 93929 03413 ఫోన్ నంబర్ల ద్వారా ఈ సేవలను వినియోగించుకోవచ్చు.

సేవలు ఉచితం



సెలవుల్లో ఊర్లకు వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవడం ద్వారా ఇంటిని భద్రంగా ఉంచుకోవచ్చు. యాప్‌లో రిక్వెస్ట్ వాచ్ పెట్టినా, ఫోన్ చేసినా సిబ్బంది ఇంట్లో కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఊరెళ్లి తిరిగి వచ్చే వరకు దొంగతనం జరగకుండా పోలీసు నిఘా ఉంటుంది. ఇళ్లకు తాళాలు వేసి వెళ్తున్నప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచవద్దు. బ్యాంకు లాకర్లలో జాగ్రత్త చేసుకోవడం మంచిది. పండగ సందర్భంగా పెద్ద పెద్ద కంపెనీలు పెద్ద ఎత్తున ఆఫర్లు ప్రకటిస్తున్నాయని, దీనిని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలచుకుని మోసాలకు పాల్పడే అవకాశం ఉంది. అవసరం లేకుండా వచ్చే మెసేజ్‌ల్లో బ్లూ కలర్ లింక్‌లను ఓపెన్ చేయొద్దు. సైబర్ నేరానికి గురైన వారు వెంటనే 1930కు కాల్ చేయాలి.

– జి.కృష్ణకాంత్, ఎస్పీ

జనసేన నాయకుల హైడ్రామా

- కార్పొరేషన్ పరిధిలో ఫ్లెక్సీలు తొలగించాలని మంత్రి ఆదేశాలు
- హైవే వద్ద పవన్ కళ్యాణ్ కటౌట్‌ను తొలగించిన మున్సిపల్ అధికారులు
- అయితే వైఎస్సార్‌సీపీపై ఆ పార్టీ నేతల ఏడుపు

నెల్లూరు సిటీ: అధికారంలోకి వచ్చాక తెలుగుదేశం, జనసేన నాయకులకు వైఎస్సార్‌సీపీపై నిరాధార ఆరోపణలు చేయడం అలవాటైపోయింది. ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయ లబ్ధి పొందేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. సాక్షాత్తు మంత్రి ఆదేశాలతో కటౌట్‌లు, ఫ్లెక్సీలు తొలగిస్తే వైఎస్సార్‌సీపీపై ఏడుస్తూ తమకు అనుకూలంగా చేసే ప్రయత్నం చేశారు.

నారాయణ ఆదేశాలతో..

కార్పొరేషన్ పరిధిలో ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఏర్పాటు చేయకూడదని, ఎవరైనా పెడితే 48 గంటలు మాత్రమే ఉంచాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ శనివారం చెప్పిన విషయం తెలిసిందే. 48 గంటల తర్వాత అధికారులు ఆయా ఫ్లెక్సీలను తీసేయిస్తారని చెప్పారు. చిల్డ్రన్స్ పార్క్‌కు సమీపంలోని జాతీయ రహదారి వద్ద సెప్టెంబర్ 2వ తేదీన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కటౌట్ ఏర్పాటు చేశారు. మంత్రి ఆదేశాలతో కదిలిన మున్సిపల్ యంత్రాంగం ఆదివారం దానిని తొలగించారు.

వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు

పవన్ కళ్యాణ్ కటౌట్‌ను ఏర్పాటు చేసి చాలారోజులు కావడంతో మున్సిపల్ అధికారులు తొలగించారు. అయితే జనసేన నాయకులు హైడ్రామా చేశారు. అపోలో హాస్పిటల్ ఎదురుగా జెట్టి శేషారెడ్డి కళ్యాణ మండపంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గం ఆత్మీయ సమావేశం నిర్వహించే క్రమంలో ఆయా ప్రాంతాల్లో ఫ్లెక్సీలు కట్టారు. పవన్ కటౌట్‌ను మున్సిపల్ సిబ్బంది తొలగించిన తర్వాతే వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీని ఆ స్థలంలో ఉంచారు. అయితే జనసేన నాయకులు దీనిని రాజకీయ లబ్ధి కోసం వాడుకున్నారు. పవన్ కటౌట్‌ను మున్సిపల్ సిబ్బంది తొలగించే వీడియో సైతం బయటకు వచ్చినా వైఎస్సార్‌సీపీ శ్రేణులు తొలగించాయని ప్రచారం చేస్తుండడంపై ఆ పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- కాగా జనసేన నాయకులు ఆందోళన పేరుతో డ్రామా చేయడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు హైవే వద్దకు చేరుకున్నాయి. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కటౌట్ మేము తొలగించలేదని, కావాలంటే సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించుకోవచ్చని నేతలు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి సర్దుబాటు చేశారు. అయితే జనసేన నేతల ఒత్తిడితో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను తొలగించారు.


పవన్ కళ్యాణ్ కటౌట్‌ను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

క్లుప్తంగా

రూ.2.50 కోట్లకు కుచ్చుటోపీ

- అప్పులు తీసుకుని మోసం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

పొదలకూరు: పొదలకూరు మండలం తాటిపర్తికి చెందిన ఓ వ్యాపారి అప్పులు తీసుకుని రూ.2.50 కోట్లకు కుచ్చుటోపీ పెట్టినట్లు ఆదివారం పదుల సంఖ్యలో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. అధిక వడ్డీకి ఆశ పడి ఒకరికి తెలియకుండా ఒకరు అతడిని నమ్మి మోసపోయినట్లు తెలుస్తోంది. సుమారు 40 మంది వరకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వారి కథనం మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు వ్యాపారం చేస్తుంటాడు. అందరితో కలుపుగోలుగా ఉంటూ వడ్డీకి నగదు తీసుకుని ఠంచనుగా వడ్డీ డబ్బులు అందజేసేవాడు. దీంతో నమ్మకం ఏర్పడడంతో ముఖ్యంగా మహిళలు నగదు ఇచ్చినట్టు చెబుతున్నారు. అతడు కొంత కాలంగా సుమారు రూ.2.50 కోట్ల వరకు అప్పులు చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల శ్రీనివాసులు అప్పుల పాలైనట్లు ఒకరికొకరు చెప్పుకుని తమ నగదు తిరిగి అందజేయాల్సిందిగా ఒత్తిడి తెచ్చారు. తన వద్ద డబ్బుల్లేవని సమాధానం చెబుతూ దాటవేస్తుండడంతో బాధితులు ఎస్సై హనీఫ్ వద్దకు వచ్చారు. తమ వద్ద అప్పుల రూపంలో పెద్ద ఎత్తున నగదు తీసుకున్న శ్రీనివాసులుతో మాట్లాడి న్యాయం చేయాల్సిందిగా వేడుకున్నారు. ఎస్సై అతడిని పిలిపించి విచారించారు. బాధితుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదులను కూడా స్వీకరించారు. అతడి ఆస్తుల వివరాలు, నగదు ఏమి చేశాడనే కోణంలో కూడా విచారిస్తున్నట్టు తెలిసింది. రూ.లక్షలు ఇచ్చిన మహిళలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమకు న్యాయం చేయాల్సిందిగా వేడుకుంటున్నారు.

ఉరేసుకుని ఒకరు.. గడ్డిమందు తాగి ఒకరు..

కోవూరు: మండలంలోని పడుగుపాడు ఎన్టీఆర్ నగర్ గిరిజన కాలనీకి చెందిన గంధళ్ల సురేష్ (39) అనే వ్యక్తి మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. సురేష్ వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య విభేదాల నేపథ్యంలో రెండు నెలల నుంచి సురేష్ వాళ్ల అమ్మ దగ్గరే ఉంటున్నాడు. ఆదివారం ఉదయం మద్యం మత్తులో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్ గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ..

మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన తాత ముకేష్ (39) ఈ నెల ఒకటో తేదీన మద్యం మత్తులో గడ్డిమందు తాగాడు. అప్పటి నుంచి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ముకేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విభేదాల నేపథ్యంలో మూడు సంవత్సరాల నుంచి ముకేష్ తన భార్యకు దూరంగా ఉంటున్నాడు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో నుంచి వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై నెల్లూరు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కలువాయి గ్రామానికి చెందిన ఇబ్రహీం మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడు. ఆయన కుమారుడు హుస్సేన్ నగరంలోని జనార్దనరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల ఇబ్రహీం కుమారుడి వద్దకు వచ్చాడు. రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి అదృశ్యమయ్యాడు. బాధిత కుటుంబసభ్యులు ఆయన కోసం గాలించారు. జాడ తెలియకపోవడంతో ఆదివారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గాండ్ల తెలికుల సంఘీయులను ఆదుకోవాలి

- అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు

నెల్లూరు(బృందావనం): ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, రాజకీయంగా వెనుకబడిన గాండ్ల తెలికుల సంఘీయులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు కోరారు. నెల్లూరులోని మినీబైపాస్ రోడ్డులో ఉన్న పరమేశ్వరి మహేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గ్రోసు గోపాలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నిరుపేదలైన గాండ్ల తెలికుల సంఘీయుల అభివృద్ధి కోసం విద్యుత్ గానుగలను ఏర్పాటు చేసుకునేందుకు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేయించాలన్నారు. కనీసం 300 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందించాలన్నారు. సంఘం మరింత బలోపేతం కావాలంటే అందరూ ఐక్యతగా సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్ మాట్లాడుతూ అమరావతి ప్రాంతంలో తమ సంఘం భవన నిర్మాణం కోసం ఎకరా స్థలం, అలాగే రాష్ట్రంలోని 26 జిల్లా కేంద్రాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు. సంఘం స్థాపించి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలను, సాధించిన ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నరవ అనంతం, రాష్ట్ర కోశాధికారి గార్లదిన్నె నాగరాజు, ప్రభాకర్‌రావు, హరగోపాల్, వరికుంట్ల రాజా, గౌరవాధ్యక్షులు, గౌరవ సలహాదారులు, క్రమశిక్షణా కమిటీ సభ్యులు, లీగల్ సెల్, యువజన కన్వీనర్లు 26 జిల్లాలకు చెందిన శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంఘం నేతలు

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.90
సన్నవి : రూ.45
పండ్లు : రూ.35

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 134
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 264
లేయర్ చికెన్ : 187

పచ్చనేతల బరితెగింపు

కూటమి ప్రభుత్వంలో పచ్చనేతలు రేయింబవళ్లు చెరువులను కొల్లగొట్టి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. అడ్డుకోవాల్సిన గనుల శాఖ, రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల శాఖ మామూళ్ల మత్తులో అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకవడంతో పచ్చనేతలు భారీగా గోతులు తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు.

- చెరువుల్లో ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- ఎవరైనా ప్రశ్నిస్తే జైలుకు పంపుతామని హెచ్చరికలు

వెంకటాచలం: మండలంలోని సగానికి పైగా గ్రామాల్లో ఉన్న చెరువుల్లో పచ్చనేతలు నిత్యం అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. వర్షాలు కురవకపోవడంతో చెరువుల్లో నీటి నిల్వలు లేవు. వాస్తవానికి అక్టోబర్ నెల వచ్చేసరికి చెరువులు సగానికిపైగా నిండి ఉండేవి. కానీ ప్రస్తుతం ఖాళీ కావడంతో పచ్చనేతల గ్రావెల్ అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. ముఖ్యంగా మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ పరిధిలోని మోమిడిగుంట చెరువులో నాలుగు రోజుల నుంచి పోటాపోటీగా తవ్వకాలు చేస్తున్నారు. చెరువులో భారీగా గోతులు తవ్వి గ్రావెల్‌ను తరలించి లేఅవుట్లు, ప్రైవేట్ భూములు లెవలింగ్‌కు వినియోగిస్తున్నారు.


మోమిడిగుంట చెరువు నుంచి గ్రావెల్ తరలింపు

వందల సంఖ్యలో..

చెరువుల్లో నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్‌ను పచ్చనేతలు రూ.1,000 నుంచి రూ.2 వేలు వంతున అమ్ముకుంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో మోమిడిగుంట చెరువు నుంచి గ్రావెల్ తరలిస్తున్నారు. అక్రమ రవాణా గురించి ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తే.. కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా చెరువులను కొల్లగొడుతున్న పచ్చ నేతల ఆగడాలను అడ్డుకోవాల్సిన గనుల, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ ముఖం చాటేస్తున్నారు.

జోసఫ్‌పేట వద్ద..

మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ పరిధిలోని జోసఫ్‌పేట సమీపంలోని పొలాల్లో నిత్యం రాత్రి వేళల్లో గ్రావెల్ రవాణా చేస్తున్నారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5 వరకు టిప్పర్లతో నెల్లూరుకు గ్రావెల్ రవాణా జరుగుతుంది. సుమారు నెలరోజులుగా ఈ తంతు జరుగుతుండగా.. సమీపంలోని నివాసాల ప్రజలు అడ్డుకునేందుకు వెళ్తే తాము అన్నీ చోట్ల మామూళ్లు ఇస్తున్నామని, అడ్డుకుంటే మీకే ఇబ్బంది అంటూ బెదిరిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని గ్రావెల్ రవాణాకు అడ్డుకట్ట వేయకపోతే రైతులు, ప్రజలు అంతా ఏకమై వెంకటాచలంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

జమ్మిపాళెంలో పూరిల్లు దగ్ధం

కోవూరు: మండల పరిధిలోని ఇనమడుగు పంచాయతీ జమ్మిపాళెంలో గుండాబత్తిన శేషయ్య అనే వ్యక్తి పూరిల్లు కాలిపోయింది. స్థానికుల కథనం మేరకు.. శేషయ్య భార్య లక్ష్మి ఆదివారం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఇంట్లోని వారందరూ బయటికి పరుగులు తీశారు. లోపలున్న వస్తువులు, మూడు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.25 వేల నగదు కాలిపోయాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించగా వారొచ్చి మంటల్ని ఆర్పివేశారు.


కాలిపోతున్న ఇల్లు

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

వెంకటాచలం: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసిన ఘటన మండలంలోని చెముడుగుంట వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలు.. కొందరు వ్యక్తులు చెముడుగుంట సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం పోలీసులకు అందడంతో వెంటనే గ్రామానికి వెళ్లి దాడులు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.65,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.

గుడ్లూరు జెడ్పీటీసీ సభ్యుడి మృతి

గుడ్లూరు(కందుకూరు రూరల్): గుడ్లూరు మండల వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యుడు కొరిశపాటి బాపిరెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. మండలంలోని గుండ్లపాళేనికి చెందిన బాపిరెడ్డి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు నివాళులర్పించారు. బాపిరెడ్డి మృతిపట్ల సంతాపం తెలిపారు.


బాపిరెడ్డి (ఫైల్)

కండలేరులో 26.955 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 26.955 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 1,250 క్యూసెక్కులు, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,000 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు.